ప్రజాశక్తి

ఆదివారం 16 జులై 2023 5 విజయనగరం



చెరువు ఆక్రమణలపై ఫిర్యాదు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని కోరాడవీధి, నక్కవీధి, కమ్మవీధి, కొత్తపేట ప్రాంతాల్లో రజకులకు ఆసరాగా ఉన్న వైఎస్ఆర్ నగర్ సర్వే 61/8,61/9 నంబర్‌లో ఉన్న చెరువును పలువురు వ్యాపారులు ఆక్రమణకు పాల్పడుతున్నారని, వారిన ఉంచి చెరువును కాపాడాలని విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణను ఎపి రజక సంఘం జిల్లా అధ్యక్షుడు తంగేటి భాస్కరరావు, కార్యదర్శి జంప చిన్న కోరారు. శనివారం మంత్రిని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఆ చెరువు పై ఆధారపడి రజక కుటుంబాలు జీవిస్తున్నాయని తెలిపారు. నేడు ఆ చెరువు కబ్జా చేయడం వల్ల ఆ కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. వెంటనే చెరువు ఆక్రమణకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. రజక సంఘం భవనం నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని కోరారు.



కప్పేసిన చెరువును చూపిస్తున్న గిరిజనులు

భూ బకాసురుల భూ దాహానికి పేద గిరిజనులు బలైపోతున్నారు. గిరిజన గ్రామాల్లో అధికార పార్టీ నేతలు, రెవెన్యూ అధికారుల అండదండలతో భూ ఆక్రమణలు పెరిగి పోతున్నాయి. ఎరకందొరవలస గిరిజనుల భూములను రెవెన్యూ అధికారుల సహకారంతో శంబంగి కళావతి పేరిట మార్చిన విషయం తెలిసిందే. ఇది మరువకముందే మరో భూ ఆక్రమణ బయటపడింది. గిరిజన గ్రామాల్లో భూ అక్రమాలు అధికంగా ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రెవెన్యూ ఉన్నతాధికారులు అక్రమాలపై దృష్టి పెడితేనే అడ్డుకట్ట పడే అవకాశం ఉందని గిరిజనులు అంటున్నారు.

గిరిజన గ్రామాల్లో భూదందాలు

- చెరువును కప్పేసి ఆక్రమణ
- ప్రభుత్వ భూమిలో మామిడి సాగు
- అధికార పార్టీ, రెవెన్యూ అధికారుల అండదండలు

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి మండలంలోని చిలకమ్మవలస గిరిజన గ్రామం సమీపంలో ఉన్న రేగుడు బందను అనుసరించి ఉన్న భూమిని జొన్నవలసకు చెందిన ఓ వ్యక్తి కొనుగోలు చేశాడు. ఆ బందను కప్పేసి చదును చేశాడు. రెండు ఎకరాల విస్తీర్ణం ఉన్న చెరువు ఎకరాకు పైగా ఆక్రమణకు గురైంది. ఇదే చెరువులో రెండేళ్ల ఉపాధి పనులు చేసినట్లు ఫీల్డ్ అసిస్టెంట్ శంకరరావు చెప్పారు. చెరువు ఆక్రమణకు గురికావడం వాస్తవమని, దీనిపై ఎంపిడిఒ, ఎపిఒలకు ఫిర్యాదు చేస్తామని ఫీల్డ్ అసిస్టెంట్ చెప్పారు.

ప్రభుత్వ భూమిలో మామిడి సాగు

భూబందరువలస సమీపంలో సర్వే నంబర్ 104లో 10 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఆ భూమిగల వ్యక్తి పక్కనే ఉన్న చెరువును కప్పేసి 6ఎకరాలు నుంచి 8 ఎకరాల వరకు ఆక్రమించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఆ భూమిని చదును చేసి మామిడి మొక్కలు నాటాడు. చెరువును కప్పేసి ప్రభుత్వ భూమిని ఆక్రమించినా అధికారులు పట్టించుకోవడం లేదని గిరిజనులు వాపోతున్నారు. గిరిజన గ్రామాల్లో జరుగుతున్న భూ ఆక్రమణలకు అధికార పార్టీ నేతలతోపాటు రెవెన్యూ అధికారుల సహాయ, సహకారాలు పుష్కలంగా ఉన్నట్లు గిరిజనులు ఆరోపిస్తున్నారు.



అక్రమంగా నరికేసిన టేకు దుంగలు

టేకు చెట్లు నరికివేత

ఆక్రమించిన చెరువుగట్టుపై, ప్రభుత్వ భూమిలో ఉన్న టేకు చెట్లను ఆక్రమణదారుడు నరికివేశాడు. చెరువుగట్టుపై ఉన్న చెట్లను నరికివేసి గట్టును పూర్తిగా జెసిబితో తొలగించారు. నరికివేసిన టేకు దుంగలను మామిడి తోటలో భద్రపరిచారు.

చెరువును కప్పేసినా పట్టించుకోలేదు



చెరువును కప్పేసినా అధికారులు పట్టించుకోవడం లేదని కాశిందొరవలస పంచాయతీ ఉపసర్పంచ్ జన్ని ఆదయ్య ఆగ్రహం వ్యక్తంచేశారు. రెండు ఎకరాలకు పైగా విస్తీర్ణం ఉన్న చెరువును కప్పేసి ఆక్రమిస్తున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి చెరువు ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆక్రమణలు తొలగించాలి



ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను తొలగించి గిరిజనులకు ఇవ్వాలని గిరిజనుడు మత్స లక్ష్మణ డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించి మామిడి మొక్కలు వేసినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని గిరిజనులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

భూఆక్రమణపై దర్యాప్తు

చిలకమ్మవలస వద్ద చెరువు కబ్జా, ప్రభుత్వ భూమి ఆక్రమణలపై సమగ్ర దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ డోల రాజేశ్వరరావు చెప్పారు. చెరువు కబ్జా, భూఆక్రమణలు తన దృష్టికి రాలేదని చెప్పారు. సమగ్ర దర్యాప్తు చేసి ఆక్రమణలను తొలగిస్తామని చెప్పారు.

ఉపాధ్యాయుడు దారుణ హత్య



- బొలెరో వాహనంతో ఢీకొట్టి.. ఆపై ఇనుప రాడ్లతో కొట్టి..
- కొత్తపేట సమీపంలో ఘటన
- మృతదేహంతో రహదారిపై గ్రామస్తుల బైఠాయింపు
- నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

రాజాం మండలం ఒమ్మి-కొత్తపేట సమీపంలో శనివారం ఉదయం ఉపాధ్యాయుడు ఏగిరెడ్డి కృష్ణ (48) దారుణహత్యకు గురయ్యాడు. ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై పాఠశాలకు వెళ్తుండగా సినీ ఫక్కీలో బొలెరో వాహనంతో ఢీకొట్టి, ఆ తరువాత రాడ్లతో కొట్టి దుండగులు హత్య చేశారు. స్థానికులు చూసి కేకలు వేయడంతో బొలేరో వాహనంలో వచ్చిన వారు పరారయ్యారు. సంఘటన స్థానికంగా కలకలం రేపింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం..

ప్రజాశక్తి-రాజాం, రేగిడి, బాడంగి

తెర్లాం మండలం ఉద్దవోలు గ్రామానికి చెందిన ఏగిరెడ్డి కృష్ణ అదే మండలంలోని కాలంరాజుపేట ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆయన భార్య రాజాంలోని సామాజిక ఆస్పత్రిలో హెచ్‌డిగా పనిచేస్తుండడంతో పట్టణంలోని ఈశ్వర నారాయణ కాలనీలో నివాసం ఉంటున్నారు. కృష్ణ రోజూ రాజాం నుంచి పాఠశాలకు బైక్‌పై వెళ్లి వస్తుంటారు. స్వస్థలమైన ఉద్దవోలుకు కూడా అవకాశం ఉన్నప్పుడల్లా వెళ్లి వస్తుంటారు. గ్రామ స్థాయి రాజకీయాల్లో ఆయన పరోక్ష పాత్ర పోషిస్తున్నారు. ఆయన మద్దతిచ్చిన వారే సర్పంచ్‌గా ఎన్నికవుతూ వస్తున్నారు. ఈ క్రమంలో ఆయనను రాజకీయంగా విబేధించిన వారే ఈ దారుణానికి పాల్పడి ఉండవచ్చునని కుటుంబ భ్యులు ఆరోపిస్తున్నారు.



కృష్ణ (ఫైల్)

శనివారం ఉదయం పాఠశాలకు బయలుదేరిన కృష్ణని ఒమ్మి-కొత్తపేట సమీపంలో వెనుక నుంచి వచ్చిన బొలేరో వాహనం ఢీకొంది. దీంతో ద్విచక్ర వాహనంతో పాటు రోడ్డుపై పడిపోయిన కృష్ణమూర్తిని బొలేరో వాహనం కొంత దూరం ఈడ్చుకుని వెళ్లిపోయింది. కృష్ణ తీవ్రగాయాలైన ఆయన ఇంకా బతికే ఉన్నాడని గమనించిన దుండగులు రాడ్‌లతో అతన్ని కొట్టి హత మార్చారు. స్థానికంగా ఉన్న కొందరు చూసి కేకలు వేయడంతో నిందితులు పరారయ్యారు.స్థానికులు రాజాం పోలీసులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులకు, గ్రామస్తులకు సమాచారం అందడంతో వారు కూడా అక్కడికి చేరుకున్నారు. ఉద్దవోలు గ్రామస్తులతో పాటు కుటుంబ సభ్యులు, సన్నిహితులు, ఉపాధ్యాయులు అక్కడికి చేరుకొని కృష్ణ మృతదేహంతో సాలూరు రోడ్డులో బైఠాయించి ఆందోళనకు దిగారు. హత్యకు పాల్పడిన నిందితులను తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు. సుమారు నాలుగు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించిపోయింది. సమాచారం తెలుసుకున్న చీపురుపల్లి డిఎస్‌పి శ్రీనివాస్ చక్రవర్తి, రాజాం సిఐ రవికుమార్ అక్కడికి చేరుకొని కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో మాట్లాడారు. ఇదే సందర్భంగా బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి చిన్నప్పలనాయుడు అక్కడికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. నిందితులను కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి తెలపడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు. పోలీసులు హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



రహదారిపై ఆందోళన చేస్తున్న గ్రామస్తులు





సాధించిన పతకాలతో పల్లవి, శ్రీలక్ష్మి

వెయిట్ లిఫ్టింగ్‌లో పతకాల పంట

ప్రజాశక్తి-నెల్లిమర్ల

కామన్‌వెల్త్ జూనియర్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో కొండవెలగాడ క్రీడాకారులు పతకాల పంట పండిస్తున్నారు. ఇప్పటికే ఆ గ్రామానికి చెందిన వల్లూరు అజయ్‌బాబు బంగారు పతకం సాధించగా, తాజాగా శనపతి పల్లవి, చుక్క శ్రీలక్ష్మి బంగారు, రజత పతకాలు సాధించారు. పల్లవి 64 కిలోల బాలికల విభాగంలో జూనియర్స్‌లో బంగారు పతకం, సీనియర్ విభాగంలో రజత పతకం సాధించింది. చుక్క శ్రీలక్ష్మి రజత పతకం కైవశం చేసుకుంది. వీరిని వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.లక్ష్మి, కార్యదర్శి టి.దినేష్‌బాబు, ఉపాధ్యక్షులు బి.వెంకటరామయ్య, జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మి, చైర్మన్ బిఎస్ఆర్ మూర్తి అభినందించారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల బదిలీలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో పని చేస్తున్న సిబ్బంది బదిలీల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిఇఒ బి.లింగేశ్వరరెడ్డి తెలిపారు. బదిలీలకు ఈనెల 17, 18 తేదీల్లో జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయం, విజయనగరం కార్యాలయపు పనివేళల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేయాలని తెలిపారు.

కంపెనీలన్నీ సిఎస్ఆర్ వివరాలు సమర్పించాలి

జిల్లా స్థాయి అవసరాలకు సహకరించాలి : కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో ఉన్న చిన్న, మధ్య తరహా, పెద్ద కంపెనీలన్నీ గత మూడేళ్లలో సిఎస్ఆర్ కింద ఖర్చు చేసిన వివరాలను 15 రోజుల్లోగా సిపిఒకు సమర్పించాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. గత మూడేళ్లలో కంపెనీ టర్నోవర్ , ప్రాఫిట్, సిఎస్ ఆర్ కింద ఖర్చు చేసిన మొత్తం, చేపట్టిన కార్యక్రమాలు తదితర వివరాలను సమర్పించాలన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరం లో శనివారం కలెక్టర్ ధ్వర్యంలో జిల్లా సిఎస్ఆర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కంపెనీ ఉన్నచోట స్థానిక అవసరాకు, ప్రాధాన్యత నిస్తూనే జిల్లా అవసరాలకు సిఎస్ఆర్ నిధులను కేటాయించాలని కోరారు. కంపెనీ వారీగా గత మూడేళ్లలో ఎలాంటి పనులు చేసారని ప్రశ్నించారు. పలు కంపెనీలు మెడికల్ క్యాంపులకు, పాఠశాలల అభివృద్ధికి ఖర్చు చేసినట్లు తెలుపగా ప్రభుత్వం నుండి ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ ద్వారా అన్ని గ్రామాల్లో వైద్య బృందం పర్యటిస్తూ, అవసరమగు పరీక్షలు నిర్వహి స్తున్నారని, సిఎస్ఆర్ కింద ప్రత్యేకంగా చేయవలసిన అవసరం లేదని, దీనివలన డూప్లికేషన్ జరిగే అవకాశం ఉందని అన్నారు. ముందుగా కంపెనీ లు వారి కార్యాచరణ ప్రణాళికలు పంపిస్తే ఇలాంటి సమస్య తలెత్తదని స్పష్టం చేసారు. పాఠశాలల అభివృద్ధికి కూడా నాడు-నేడు కింద ప్రభుత్వం నిధులు కేటాయిస్తూ పనులు చేపడుతోందని, ముందుగా ఈ అంశాలను పరిశీలించి తర్వాత సిఎస్ఆర్ నిధులు కేటాయించాలని సూచించారు. అత్యవసర కార్యక్రమాలకు సిఎస్ఆర్ నిధులు కేటాయిస్తే ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కింద నిరుద్యోగులైన యువతకు శిక్షణ ఇచ్చేందుకు కంపెనీలు ముందుకు రావాలని కలెక్టర్ కోరారు. ఐటిఐ , పాలిటెక్నిక్ సంస్థలకు నిపుణులు హాజరై శిక్షణ ఇవ్వాలని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

జూలైలో పెద్ద ఎత్తున ఆర్మీ రిక్రూట్మెంట్ రాలి జరుగుతుందని, అందుకు కొంత నిధులు అవసరం ఉందని, కంపెనీలు సహకరించాలని కోరారు. ప్రతి ఏటా అమ్మవారి పండగ సందర్భంగా విజయనగరం ఉత్సవాలు అక్టోబర్ నెలలో జరుగుతాయని, ఈ ఉత్సవాలకు కూడా కంపెనీలు సహకారాన్ని అందించాలని కోరారు. సిఎస్ఆర్ ఫండ్స్‌కు సిపిఒ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని, ఆర్మీ రిక్రూట్మెంట్ ఎకౌంటు వేరేగా నిర్వహించాలని, సిఎస్ఆర్ ఫండ్స్ రికార్డులను కూడా నిర్వహించాలని సూచించారు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్, పరిశ్రమల శాఖ జిఎం పాపారావు, సిపిఒ బాలాజీ, డిప్యూటీ కమీషనర్ అఫ్ లేబర్ సుబ్రహ్మణ్యం, కాలుష్య నియంత్రణ, ఇన్‌స్పెక్టర్ అఫ్ ఫాక్టరీస్, 30 కంపెనీ లకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.



లోగోను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యారంగ సమస్యల పరిష్కారానికి

విద్యార్థి సంగ్రామ సైకిల్‌యాత్ర

లోగోను ఆవిష్కరించిన ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా విద్యారంగ అభివృద్ధికై జరగబోయే విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్రను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ వెంకటేష్, పి.రామ్మోహన్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఎల్‌బిజి భవన్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన నిర్వహించనున్న విద్యార్థి సంక్షేమ సైకిల్‌యాత్ర లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో విద్యారంగ అభివృద్ధే ధ్యేయంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న సంక్షేమ హాస్టళ్లను అదే విధంగా ప్రభుత్వ విద్యాలయాలను సందర్శిస్తూ 400 కిలోమీటర్లు విద్యార్థి సంగ్రామ యాత్ర సాగనుందని తెలిపారు. ఈనెల 31న కొత్తవలసలో ప్రారంభమై జిల్లా వ్యాప్తంగా పర్యటిస్తూ వేలాదిమంది విద్యార్థులను కలుస్తూ ఆగస్టు 9న జిల్లా కేంద్రంలో ముగుస్తుందని తెలిపారు. జిల్లాలో పేరుకుపోయిన విద్యారంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తమ దృష్టికి సమస్యలపై యాగ్ర ముగింపులో విద్యాశాఖ అధికారులకు వినతి అందజేస్తామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా జరిగే ఈ సైకిల్ యాత్రను విద్యార్థులు, మేధావులు, యువజనులు జయప్రదం చేయాలని కోరారు. యాత్ర ప్రారంభమయ్యే లోపు అధికారులు తక్షణమే ఈ సమస్యలన్నింటికీ పరిష్కారం చూపాలని లేనిపక్షంలో యాత్ర ముగిసిన తర్వాత విద్యార్థులతో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు డి.రాము, వి.చినబాబు, సిహెచ్ రామకృష్ణ, జిల్లా గర్ల్స్ కో కన్వీనర్ లావణ్య, జిల్లా సహాయ కార్యదర్శులు ఎం. హర్ష , జె.రవి కుమార్, ఎం.వెంకీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సేవలందించడమే లక్ష్యం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



ధ్రువపత్రాలు అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజావసరాలను గుర్తించి ఇళ్ల ముంగిటకే ప్రభుత్వ సేవలను అందించడమే వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆశయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. శనివారం 25, 26, 27, 29 డివిజన్ల కు సంబంధించి ఆయా సచివాలయాల పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష పథకం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇందులో భాగంగా 11 రకాల ధవీకరణ పత్రాలను ప్రజల చెంతకే సులభతర రీతిలో పూర్తి ఉచితంగా అందించేందుకు జగనన్న సురక్ష పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. ఎక్కడా లంచగొండితనం లేకుండా పూర్తి పారదర్శకంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందించడమే లక్ష్యంగా పాలన సాగుతోందన్నారు. ఎక్కడ ఎటువంటి లోటుపాట్లు లేకుండా పారదర్శకంగా అర్హతే ప్రామాణికంగా అందిస్తున్న విధానాన్ని ప్రతి ఒక్కరూ స్వాగతించాలన్నారు. సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ప్రజలు ఆశీస్సులు అందించాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, కమిషనర్ ఆర్ శ్రీరాములు నాయుడు, సహాయ కమిషనర్ ప్రసాదరావు, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు దుప్పాడ సునీత, జోనల్ ఇన్చార్జులు అల్లు చాణక్య, వైసిపి నాయకులు యవర్ణ కుమారస్వామి, యడ్ల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నగరంలోని 19, 21 డివిజన్‌లో రూ.32లక్షలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి శంకుస్థాపనలు చేశారు. 19 డివిజన్లోని లంక పట్నంలోనూ, 21వ డివిజన్లోని అరకాల గెడ్డ వీధి, బింగి వీధులలో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా 21వ డివిజన్ కార్పొరేటర్ కనకల నాగవల్లి మాట్లాడుతూ అభివృద్ధి ధ్యేయంగా ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించేందుకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, 19వ డివిజన్ కార్పొరేటర్ పొట్నూరు శ్రీనివాసరావు, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ ఆవునాపు లక్ష్మణరావు, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ భాస్కర్ రెడ్డి, కాళ్ళ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షమా..! నువ్వెక్కడ?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో ప్రతిపక్ష పార్టీ ఉనికిపై అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. అసలు ఉందా? లేదా? అంటూ పలువురు ఒకింత హాస్యాస్పద సందేహాలను వ్యక్తం చేస్తున్నారు. ఒక వేళ ప్రతిపక్ష పార్టీ ఉందనుకున్నా ప్రతిపక్షం అనే పాత్రపోషించలేక పోతుందని మరికొందరు వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. ఇందుకు కారణం లేకపోలేదు. ప్రభుత్వం చర్యలు, జిల్లాలో చోటు చేసుకుంటున్న పరిణామాలను తిప్పికొట్టడంలో టిడిపి పూర్తిగా విఫలమైంది. ప్రతి నియోజకవర్గంలోనూ అంతర్గతపోరే ఇందుకు కారణమన్న చర్చ బాహాటంగానే సాగుతోంది. ముఖ్యంగా చెరకు రైతుల సమస్యపై అధికార పార్టీ నోరు మెదపడం లేదు. భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ మూసేయడమే కాకుండా రైతులు సాగు తగ్గించుకోవడం వల్లే ఫ్యాక్టరీ తెరవలేకపోతున్నామంటూ బుకాయించినా మూగబోయిన ప్రతిపక్షం నోరు తెరుచుకోలేదు. దీంతో, చెరకును గత్యంతరం లేని పరిస్థితుల్లో 40 నుంచి 70కిలోమీటర్ల దూరంలోవున్న సంకిలికి తరలించుకోవాల్సిన దుస్థితి దాపురించింది. ఎస్.కోట నియోజకవర్గ వ్యాప్తంగా భూకబ్జాలు జరిగాయంటూ సాక్షాత్తు అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్సీ రఘురాజు బహిరంగంగా ప్రకటించినప్పటికీ అక్కడి టిడిపి నేతలు కిమ్మనలేదు. ఖరీఫ్ సీజన్ ముంచుకొచ్చినా ఇప్పటికీ శివారు ఆయుకట్టుకు నీరందించాలని మాట్లాడలేదు. మరోవైపు 1.21లక్షల ఎకరాలకు సాగునీరు అందించాల్సిన తోటపల్లి ద్వారా 80వేలకు మించి సాగునీరు అందే పరిస్థితి లేదని సాక్షాత్తు ఇరిగేషన్ శాఖ లెక్కలే స్పష్టం చేస్తున్నాయి. తోటపల్లి, తారకరామ తీర్థసాగర్ నిర్వాసితులు నష్టపరిహారం పునరావాసం కోసం ఆందోళన చెందుతున్నా పట్టించుకోలేదు. అటు మన్యం జిల్లాలో జీడిరైతుల అందోళన అక్కడి టిడిపి నాయకులకు పట్టలేదు. ఇటీవల రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు 36గంటల మహాధర్నా చేపట్టిన విషయం విధితమే. వేలాది సంఖ్యలో తరలివచ్చిన అంగన్‌వాడీలు ప్రభుత్వంతో తాడో పేడో తేల్చుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా అనేక ప్రజా, కార్మిక, ఉద్యోగ సంఘాలు స్వచ్ఛందంగా ధర్నా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలియజేసినప్పటికీ టిడిపి, వాటి అనుబంధ సంఘాల పత్తా కనిపించలేదు. దీంతో, గతంలో అంగన్‌వాడీల ఆందోళన సందర్భంగా టిడిపి ప్రభుత్వం గుర్రాలతో తొక్కించిన సందర్భాన్ని పలువురు గుర్తుచేశారు. ఇలా ఒకటా? రెండా? ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించడంలో ప్రతిపక్ష హోదాలోవున్న టిడిపి పూర్తిగా విఫలమైంది. పైగా అంతర్గత విభేదాలతో జిల్లా పార్టీ కొట్టుమిట్టాడుతోంది. బొబ్బిలి మినహా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ పార్టీ రెండుగా చీలి వుంది. జిల్లాలో అన్నీ తానై వ్యవహరిస్తున్న కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు, స్థానిక మాజీ ఎమ్మెల్యే గీతను కలుపుకుని ముందుకు వెళ్లేందుకు సాహశించడం లేదు. దీంతో, గీత ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేసుకున్నారు.



గజపతినగరంలో మాజీ ఎమ్మెల్యే కెఎ నాయుడిని కూడా అశోక్ గజపతిరాజు టార్గెట్ చేశారన్న చర్చ జరుగుతోంది. అందులో భాగంగానే కరణం శివరామకృష్ణ ఆ నియోజక వర్గంలో ప్రోత్సహిస్తున్నారు. ఈ నేపథ్యంలో కెఎ నాయుడు శ్రీకాకుళం మండలం ఎచ్చెర్లకు చెందిన మాజీ మంత్రి కిమిడి కళావెంకటరావు ఆశీస్సులతో ముందుకు సాగుతున్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో కలిశెట్టి అప్పలనాయుడు చేస్తున్న పార్టీ కార్యకలాపాలు కళావెంకటరావుకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. రాజాంలో మాజీ స్పీకర్ ప్రతిభా భారతి కళావెంకటరావు గ్రూపులోనూ, కోండ్రు మురళి అశోక్ గజపతిరాజు గ్రూపులోనూ ఉన్నారు. ఎస్.కోటలో స్థానిక మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, రాష్ట్ర కార్యదర్శిగా ఇటీవల ఎన్నికైనా గొంపకృష్ణ మధ్య పార్టీలో ఆధిపత్య పోరు కొనసాగుతోంది. భోగాపురంలో కర్రోతు బంగార్రాజుకు ఇటీవల సీటు ఖరారైనట్లు ప్రచారం జరగడంతో మాజీ ఎమ్మెల్యే పతివాడ నారాయణ స్వామితోపాటు మరో నేత అంతర్గతంగా మదన పడుతున్నట్టుగా చర్చ నడుస్తోంది. చీపురుపల్లిలో చీలికలేవీ కనిపించకపోయినప్పటికీ ఆ నియోజకవర్గాన్ని అంటిపెట్టుకుని ఉన్న కిమిడి నాగార్జున జిల్లా పార్టీ సారథి పాత్రపోషించలేకపోతున్నారని చర్చ నడుస్తోంది. గ్రూపులను నివారించకపోవడం ఇందుకు కారణం. అటు మన్యం జిల్లా సాలూరులో మాజీ ఎమ్మెల్సీ గుమ్మడి సంధారాణి, మాజీ ఎమ్మెల్యే భంజ్‌దేవ్‌ల మధ్య అంతర్గత యుద్ధం కొనసాగుతోంది. కురుపాంలో దత్తిలక్ష్మణరావు గ్రూపులు కడుతున్నారన్న చర్చ సాక్షాత్తు ఇటీవల చంద్రబాబు సమక్షంలోనే జరిగిన పంచాయతీలో తేలింది. పార్వతీపురంలో టిడిపి నాయకులు ఏకంగా వైసిపి నాయకులతోనే కుమ్మకయ్యారనే ప్రచారం నడుస్తోంది. ఇలా వచ్చే ఎన్నికల్లో సీట్ల కోసం కొందరు, ఉనికి కోసం మరికొందరు ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజాసమస్యలు, ప్రభుత్వ తప్పిదాలను, ఇష్టారాజ్యంగా వ్యవహరించే తీరును పట్టించుకోక పోవడంతో జిల్లాలో ప్రతిపక్షం ఉందా? లేదా? అంటూ ప్రజానీకం విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికార పార్టీ, ముఖ్యంగా ఎమ్మెల్యేలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని కూడా జనం చర్చించుకుంటున్నారు.

పీస్‌వర్క్ విధానం రద్దుచేయాలని వినతి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

విద్యుత్తు జిల్లా స్టోర్స్ హమాలీలకు ప్రభుత్వం పీస్ వర్క్ విధానం రద్దు చేసి, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో జీతం ఇవ్వాలని హమాలీ సంఘం నాయకులు కెల్ల గోవింద, పతివాడ లక్ష్మణ రావు.. ఇపిడిసిఎల్ సిఎండికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 40 ఏళ్లుగా విద్యుత్తు స్టోర్స్, ఎస్‌పిఎం వద్ద 228 మంది హమాలీలుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారని తెలిపారు. పీసురేటు పద్ధతిలో ప్రతి నెలా జీతం అందుతున్నా పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో ఎటూ సరిపడే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పి.నారాయణరావు, కెకె దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రోటోకాల్ పాటించని అధికారులు

ప్రజాశక్తి-బాడంగి

మండలంలో అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదని టిడిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పాలవలస గౌరు తెలిపారు. శనివారం ఎరుకులపాకలు గ్రామంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో టిడిపి సానుభూతిపరులను పిలిచి అవమానిస్తున్నారని చెప్పారు. పదవి లేని వైసిపి నాయకులకు ప్రాధాన్యత ఇచ్చి, ప్రజలతో ఎన్నికైన ప్రజాప్రతినిధులను పట్టించుకోకపోవడం సరికాదన్నారు. రాజకీయ కారణాలతో ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని చెప్పారు. ఇకనైనా అధికారులు తీరు మార్చుకొని తగు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

సంఘాలన్నీ ఎ-గ్రేడ్‌లో ఉండాలి

ప్రజాశక్తి-వంగర

గ్రామాల్లో ఉన్న స్వయం సహాయక సంఘాలన్నీ కూడా ఎ-గ్రేడ్‌లో ఉండేలా కృషి చేయాలని ఎపిఎం మీసాల చక్రపాణి అన్నారు. వంగరలో గ్రామ సంఘాల అధ్యక్షులు, విఒఎలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు ఏ విధంగా వినియోగించుకోవాలి?, రుణాలు చెల్లించే విధానం తదితర వాటిపై వివరించారు. త్వరలోనే గ్రామైక్య సంఘాల ద్వారా ఆడిట్ నిర్వహిస్తామన్నారు. వీటికి సంబంధించి ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌పిఒ ఎపిఎం గోవిందరావు పాల్గొన్నారు.

ఎస్.కోట సిఐగా బాల సూర్యారావు

ప్రజాశక్తి-శృంగవరపుకోట


సిఐ బాల సూర్యారావు

శృంగవరపుకోట సిఐగా ఎస్.బాల సూర్యారావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సింహాద్రి నాయుడు విశాఖపట్నానికి బదిలీపై వెళ్లారు. కొత్తవలసలో సిఐగా బాధ్యతలు నిర్వర్తించిన బాల సూర్యారావు ఇక్కడికి బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన సిఐ బాల సూర్యారావుకు ఎస్‌ఐలు తారకేశ్వరరావు, లోవరాజు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు.

రోడ్ సేఫ్టీపై అవగాహన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రహదారి భద్రతపై శనివారం గురజాడ పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రహదారి భద్రత ఎన్‌జిఒ అధ్యక్షులు మజ్జి అప్పారావు ఆధ్వర్యాన విద్యార్థులకు ఈ అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదంలో గాయపడిన వారికి సహాయం చేసి ప్రభుత్వం అందిస్తున్న రూ.5వేలు నగదు బహుమతి, ప్రశంసాపత్రం పొందాలని అన్నారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె.రవిశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు రోడ్ సేఫ్టీ పై సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పూడి శేఖర్, రోడ్ సేఫ్టీ డాక్టర్ సాయి కుమార్, న్యాయవాది రాంబాబు, కమిటీ సభ్యులు ఆదిబాబు, శ్రీరామ్మూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సైకిల్ షెడ్ లేక బహిరంగ ప్రదేశంలో ఉన్న విద్యార్థుల సైకిళ్లు

సైకిల్ షెడ్ లేక ఇక్కట్లు

ప్రజాశక్తి-మెరకముడిదాం

మండలంలోని బిల్లలవలస జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో సైకిల్ షెడ్ లేక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. సైకిల్ షెడ్డు లేక కళ్లల్లో, చెట్ల కిందో సైకిళ్లను పెడుతున్నారు. వానలకు, ఎండలకు పాడై పోవడం, పాఠశాల అనంతరం సైకిళ్లు ఉంటాయో, ఉండవోననే ఆందోళన పడుతున్నారు. సైకిల్‌షెడ్ నిర్మించాలని విద్యార్థులు కోరుతున్నారు.

జెడ్‌పి చైర్మన్‌కు పలువురి పరామర్శ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తండ్రిని కోల్పోయిన జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను)ను టిటిడి చైర్మన్ వైవి సుబ్బారెడ్డి, రాష్ట్ర ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ శనివారం పరామర్శించారు. చిన్నశ్రీను తండ్రి నర్సింగరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.


మహాశక్తి వాహనం వద్ద అశోక్, టిడిపి నాయకులు

మహాశక్తి వాహనం ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం కోట

టిడిపి రాష్ట్ర ప్రజలకు ఇస్తున్న భవిష్యత్తుకు గ్యారంటీ హామీలలో భాగంగా మహిళల కోసం ఇచ్చిన మహాశక్తి పథకాల ప్రచారం నిమిత్తం స్టిక్కరింగ్ చేసిన కారును శనివారం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు పి.అశోక్‌గజపతిరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, జిల్లా కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు, గంటా పోలి నాయుడు, వేచలపు శ్రీనివాసరావు, కనకల మురళీమోహన్ పాల్గొన్నారు.

జనసేన కార్యకర్తల పాలాభిషేకం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కటౌట్‌కు శనివారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు పాలాభిషేకం చేశారు. ఇటీవల మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట పవన్ కళ్యాణ్ కు వ్యతిరేకంగా వాలంటీర్లతో వైసిపి నాయకులు చేయించిన కార్యక్రమానికి నిరసనగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రౌతు సతీష్, పుష్ప కుమారి, త్యాడ రామకృష్ణారావు(బాలు), హుస్సేన్ ఖాన్ మాట్లాడారు. వాలంటీర్ వ్యవస్థపై పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను వక్రీకరిస్తూ వాలంటీర్లకు రెచ్చగొట్టి పవన్ కళ్యాణ్ కు వ్యతిరేకంగా కార్యక్రమాలను చేపట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. జగన్‌కు వాలంటీర్లపై అంత ప్రేమ ఉంటే వారి ఉద్యోగాలకు భద్రత కల్పిస్తూ.. వారి జీతాన్ని పదివేలు చేసి,ఉద్యోగాన్ని పర్మినెంట్ చేయాలని అన్నారు.

బోగస్ ధ్రువపత్రాలపై విచారణ

సీతంపేట : బోగస్ ధ్రువపత్రాలపై విచారణ నిమిత్తం శనివారం డిఎల్ఎస్‌వి శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటిడిఎ పిఒ కల్పనా కుమారి మాట్లాడుతూ కేసుల విచారణ వేగవంతం చేయాలన్నారు. కేసులకు సంబంధించిన నివేదికలను త్వరితగతిన తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎపిఒ రోసిరెడ్డి, డిడి శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ దేశ్ తదితరులు పాల్గొన్నారు.


సమస్యల సత్వర పరిష్కారానికే సురక్ష

ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

అందరి సమస్యలు సత్వర పరిష్కారానికే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని పెదఖండేపల్లి, ముషిడిపల్లి గ్రామ సచివాలయాల పరిధిలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ధ్రువపత్రాలు కావాలంటే తహశీల్దార్ కార్యాలయం చుట్టూ నెలల తరబడి తిరగాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం జగనన్న సురక్ష ద్వారా ఒకటి రెండు రోజుల్లోనే సర్టిఫికెట్లు నేరుగా ఇంటికి అందుతున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా పెద్దకండేపల్లి నుంచి శృంగవరపుకోటకు రహదారి మంజూరు చేయాలని గ్రామస్తులు కోరారు. రెండు నెలల్లో మంజూరు చేయించే బాధ్యత తాను తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం పలువురు కౌలురైతులకు సిసిఆర్‌సి కార్డులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, స్టేట్ ఫోక్ అకాడమీ డైరెక్టర్ వి.రాంబాబు, తహశీల్దార్ శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి పినిశెట్టి వెంకటరమణ, పోతనపల్లి కె.వెంకటరావు,


బాడంగి... ధ్రువపత్రాలు అందజేస్తున్న జెడ్‌పిటిసి రామారావు, మరిపి శంకరరావు



నెల్లిమర్ల, శృంగవరపుకోటలో ధ్రువపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

వైసిపి మండల అధ్యక్షులు మోపాడ కుమార్, జెసిఎస్ ఇన్‌ఛార్జి వి.సతీష్, షేక్ రెహమాన్, పి.జగదీష్, పి.తాతబాబు, నేతేటి శివ, మోపాడ కోటి, ఒబ్బిన బంగారునాయుడు పాల్గొన్నారు.

మండలంలోని పెదఖండేపల్లి, ముషిడిపల్లి గ్రామాల్లో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు, వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాజు, మాజీ ఎంపిపి ఒంటి అప్పారావు పాల్గొన్నారు.

కొత్తవలస : మండలంలో తుమ్మికాపల్లి, దేవాడ గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, వైసిపి మండల అధ్యక్షులు ఒబ్బిన నాయుడు, తహశీల్దార్ శ్రీనివాస్ మిశ్రా, ఎంపిడిఒ వై.పద్మజ లబ్ధిదారులకు ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెసిఎస్ కన్వీనర్ బొంత వెంకట్రావు, అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్ పిఎస్ఎన్ పాత్రుడు, తుమికాపల్లి వైస్ సర్పంచ్ అడ్డూరి సత్యనారాయణ, ఎంపిటిసి పీల లక్ష్మి, పంచాయతీ సెక్రటరీ జోగారావు , విఆర్ఒ సరోజినీ పాల్గొన్నారు.

బాడంగి : మండలంలో గజరాయనివలస, కోటిపల్లి గ్రామాల్లో జెసిఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి రామారావు, ఎంపిపి గౌరి మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులందరికీ ధ్రువపత్రాలు అందించి, సంక్షేమ పథకాలు చేరువ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు తెంటు మధు, ఎం.సత్యంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నగర పంచాయతీలో 1254 ధ్రువపత్రాలు జారీ

నెల్లిమర్ల : నగర పంచాయతీలో జగనన్న సురక్ష కార్యక్రమంలో 1254 ధ్రువపత్రాలను జారీ చేశారు. శనివారం నగర పంచాయతీ పరిధిలో పద్మశాలివీధిలోని వార్డు సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారులకు ఎమ్మెల్సీ సురేష్‌బాబు, నగర పంచాయతీ చైర్ పర్సన్ బంగారు సరోజినీ ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ వెంకట కృష్ణారావు, వైసిపి నగర పంచాయతీ అధ్యక్షులు చిక్కాల సాంబశివరావు, కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్ పాల్గొన్నారు.

పరిహారం చెల్లించాకే రహదారి పనులు చేపట్టాలి

గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుపై బైఠాయించిన రైతులు

ప్రజాశక్తి- మెంటాడ

గ్రీన్‌ఫీల్డ్ హైవేలో భూములు కోల్పోయిన రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించాక పనులు చేపట్టాలని కోరుతూ శనివారం మెంటాడ వద్ద రహదారిపై బాధిత రైతులంతా బైఠాయించారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల కోసం మెటీరియల్ తీసుకెళ్లాల్సిన వాహనాలను వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. ప్రస్తుత ధరలకు అనుగుణంగా భూములకు నష్టపరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. ఇప్పటికే గ్రీన్‌ఫీల్డ్ రహదారి, రింగ్ రోడ్డు నిర్మాణం కోసం సుమారు 180 ఎకరాలు నష్టపోయామని, మిగతా భూములకు రహదారి కల్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. దీంతో ఎన్‌హెచ్ఎఐ అధికారులు ఆ సంఘటన స్థలానికి చేరుకుని, రైతులను బుజ్జగించే పని చేపట్టారు. రైతులు మాత్రం లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చి, పనులు చేపట్టాలని కోరారు. మిగిలి ఉన్న భూములకు రహదారి కల్పించే వరకూ పోరాటం ఆగదని రైతులు తెగేసిచెప్పారు.

కార్యక్రమంలో మెంటాడ సర్పంచ్ రేగిడి రాంబాబు, మాజీ సర్పంచ్ పాండ్రంకి సన్యాసిరావు, మాజీ ఎంపిటిసి మండల తిరుపతిరావు, పతివాడ విశ్వేశ్వరరావు, పసుపురెడ్డి గోవింద, తాడ్డి కృష్ణ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.


రోడ్డుపై బైఠాయించిన రైతులు

ఉపాధ్యాయులకు డిజిటల్ బోధన పద్ధతుల్లో శిక్షణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక సీతం ఇంజనీరింగ్ కళాశాలలో గత 15రోజులుగా ఉపాధ్యాయులకు డిజిటల్ బోధనా పద్ధతుల్లో శిక్షణ ఇస్తున్నారు. మన్యం జిల్లా యంత్రాంగం దాదాపు 1600 మంది ఉపాధ్యాయులకు కొత్త బోధనా పద్ధతుల్లో శిక్షణ ఇస్తున్నారు. డిజిటల్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ ఎనేబుల్డ్ టీచింగ్ అండ్ లెర్నింగ్ ట్రైనింగ్ ప్రోగ్రాం కింద, ఉపాధ్యాయులు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ (ఐఎఫ్‌పి) మద్దతుతో కొత్త బోధనా పద్ధతులను అవలంబించాల్సి ఉంది. పార్వతీపురం మన్యం డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్ ఉపాధ్యాయుల శిక్షణను పరిశీలించారు. విజయనగరంలో జరిగే శిక్షణా కార్యక్రమానికి కోర్సు ఇంఛార్జ్ గా గజపతినగరం ఎంఇఒ2 సాయి చక్రధర్ వ్యవహరిస్తున్నారు. సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయులకు సాంకేతికతను బోధించడానికి సీతంలోని ఉత్తమ అధ్యాపకులు తమ సహాయ సహకారాలను అందిస్తున్నారని అన్నారు.

అర్హతే సంక్షేమ పథకాలకు ప్రామాణికం

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అర్హత ఉన్న ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల లబ్ధిని అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. శనివారం నగరంలోని 6వ డివిజన్ పరిధి దాసన్నపేట, కాపు వీధి తదితర ప్రాంతాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, అధికారులతో కలిసి ఆయన ప్రతి ఇంటికీ వెళ్లారు. ప్రభుత్వ పాలన తీరును వివరించారు. అటు రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమ పరిపాలనను వివరిస్తూనే.. నియోజకవర్గంలో ఈ నాలుగేళ్లలో చేస్తున్న అభివద్ధిని తెలియజేశారు. ఆయా కుటుంబాలు పొందిన సంక్షేమ పథకాల లబ్ధిని తెలుసుకుంటూ, స్థానికంగా ఉన్న సమస్యలను ఆరా తీశారు. కాలువలు, రహదారులు, విద్యుత్తు సంబంధిత సమస్యలను పలువురు తెలపగా.. వెనువెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో జోనల్ ఇన్చార్జి బొద్దాన అప్పారావు, కార్పొరేటర్ ఆల్తి సత్య కుమారి, రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి మండలి డైరెక్టర్ సంగం రెడ్డి బంగారు నాయుడు, నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ ప్రసాదరావు, జోనల్ ఇన్చార్జిలు కృష్ణారావు, ఈశ్వర రావు, గురుమూర్తి, పార్టీ నాయకులు శ్రీనివాసరావు, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

కొత్తచామలాపల్లిలో గడపగడపకు..

శృంగవరపుకోట : మండలంలోని ఆలుగుబిల్లి గ్రామ సచివాలయ పరిధిలో కొత్త చామలాపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు శనివారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం ద్వారా వర్తించిన పథకాల ప్రయోజనాలు, ప్రభుత్వ విధానాలు, పాలన వ్యత్యాసాలు వివరించారు. ప్రతి కుటుంబం సంతోషంగా ఉండటమే ప్రభుత్వం లక్ష్యమని ఆయన అన్నారు. స్థానికుల సమస్యలు తెలుసుకుని, పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి పినిశెట్టి వెంకటరమణ, స్టేట్ ఫోక్ అకాడమీ డైరెక్టర్ వి.రాంబాబు, వైసిపి మండల అధ్యక్షులు మోపాడ కుమార్, ఎఎంసి డైరెక్టర్ పద్మ, సర్పంచ్ జుత్తాడ సూర్యారావు, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయ కూడలిలో మున్సిపల్ కార్మికులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రాకముందు మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తానని, చంద్రబాబు ప్రభుత్వం మిమ్మల్ని మోసం చేసిందని చెప్పి ఓట్లు వేయించుకున్నారని తెలిపారు. నాలుగేళ్లు గడిచినా నేటికీ ప్రభుత్వం పర్మినెంట్ ఊసే ఎత్తడం లేదన్నారు. సమాన పనికి సమాన వేతనం లేదని, పింఛన్లు, గాడ్యూటీ లేవని ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై దశల వారీగా పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 27న మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు చెప్పారు. ఆగస్టు 7న కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తామన్నారు. అప్పటికీ ప్రభుత్వం దిగిరాకపోతే నిరవధిక సమ్మెకు సిద్ధమవుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పట్టణ అధ్యక్షులు జి.గౌరేష్, కార్యదర్శి జె.రామారావు, బి.యుగంధర్, బి.వెంకటి, జి.శంకరరావు, ఎం.ప్రసాద్ కార్మికులు పాల్గొన్నారు.



పాదయాత్ర చేస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

ప్రమాదాలు జరుగుతున్నా స్పందించరా?

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన

ప్రజాశక్తి-బొబ్బిలి

రోడ్డుపై పెద్ద గోతులు ఏర్పడి ప్రమాదాలు సంభవిస్తున్నా ఎందుకు బాగు చేయడం లేదని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పూల్‌బాగ్ రోడ్డు బాగు చేయాలని శనివారం దాడితల్లి ఆలయం నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు టిడిపి ఆధ్వర్యాన పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత రహదారులను పట్టించుకోలేదన్నారు. రహదారులపై పెద్ద గోతులు ఏర్పడడంతో రాకపోకలకు ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గోతులమయంగా రహదారులు మారడంతో ప్రమాదాలు సంభవించి, పలువురు మృత్యువాత పడుతున్నా అధికార యంత్రాంగానికి పట్టకపోవడం దుర్మార్గమన్నారు. పాడైపోయిన రోడ్లను బాగు చేయాలని డిమాండ్ చేశారు. పాదయాత్రలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిర్మాణాలు చేపట్టకుంటే పట్టాలు రద్దు

మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ


వేపాడ.. లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-వేపాడ

ఇళ్ల నిర్మాణాలు చేపట్టకుంటే పట్టాలు రద్దు చేస్తామని మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ హెచ్చరించారు. ఆ స్థలంలో వేరొకరికి పట్టాలు మంజూరు చేస్తామన్నారు. వేపాడ మండల కేంద్రంలో జగనన్న గృహనిర్మాణాలు మందకొడిగా సాగడంతో లబ్ధిదారులతో శనివారం ప్రత్యేకాధికారి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో 75 శాతం గృహనిర్మాణాలు చేపట్టారని తెలిపారు. వేపాడలో మాత్రం 121 ఇళ్లకు గాను 63 మంది మాత్రమే నిర్మాణాలు ప్రారంభించారని చెప్పారు. 11 మంది పునాది స్థాయి వరకు పనులు చేపట్టారన్నారు. 10 మంది పనులు ప్రారంభించలేదని చెప్పారు. 15 రోజుల్లో పనులు ప్రారంభించకుంటే పట్టాలు రద్దు చేస్తామన్నారు. అనంతరం గృహ నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ప్రసన్నకుమార్, ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి మహమ్మద్ ఖుషీద్ అలీ, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ వి.దేవి. ఎపిఎం ఆర్.శ్రీనివాసరావు, ఎపిఒ, వర్క్‌ఇన్‌స్పెక్టర్ గంగాధర్. వైసిపి నాయకులు ఎం.రమణ, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందితో సమీక్ష

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సచివాలయాల సిబ్బందితో ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ సమీక్ష నిర్వహించారు. జగనన్న గృహాల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, తక్షణమే అర్హులైన వారి జాబితాను తహశీల్దార్ కార్యాలయానికి అందించాలని కార్యదర్శులను ఆదేశించారు. కార్యక్రమంలో డిటి సన్యాసినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వారంలో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలి

నెల్లిమర్ల : పునాది స్థాయి ఉన్న ఇళ్ల నిర్మాణాలు వారం రోజుల్లో ప్రారంభించాలని హౌసింగ్ జిల్లా ప్రత్యేకాధికారి వి.శ్రీనివాస్ సూచించారు. శనివారం గరికిపేటలో హౌసింగ్ డే సందర్భంగా అధికారులు లేఅవుట్‌ను పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పునాదిస్థాయిలో ఉన్న ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించకుంటే లబ్ధిదారులు ఇబ్బందులు పడతారని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ డిఇ జి.మురళీమోహన్, ఎఇ ఆర్.పవన్, సర్పంచ్ జి.ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

విలేజ్ హెల్త్ క్లినిక్ సందర్శన


గ్రామస్తులతో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

ప్రజాశక్తి-గజపతినగరం

మండలంలోని పురిటిపెంట విలేజ్ హెల్త్‌క్లినిక్‌ను డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు పరిశీలించారు. అంతకుముందు మరుపల్లి పిహెచ్‌సిని సందర్శించి, అనంతరం పురిటిపెంటలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. వీధుల్లో తిరుగుతూ ప్రజలను కలిసి పారిశుధ్యం, జ్వరాలు తదితర అంశాలపై ఆరా తీశారు. క్లినిక్‌లో ఉన్న మందులను, రికార్డులను, ల్యాబ్ పరీక్ష గదిని తనిఖీ చేశారు. తదుపరి ఆరోగ్య కేంద్రంలో అందుతున్న ఆరోగ్య సేవల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అక్కడ జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. అంగన్వాడీ సెంటర్‌ను పరిశీలించారు. కంటివెలుగు కార్యక్రమంలో అవ్వా తాతలకు స్క్రీనింగ్ చేసి వారికి అవసరమైన వారికి కళ్ల అద్దాలు లేదా కంటి శుక్లాల ఆపరేషన్ ఉచితంగా చేస్తారని తెలిపారు. ఆగస్ట్ 7నుంచి మొదలవుతున్న మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని సక్రమంగా జరిపించాలని ఆశాలకు, ఎఎన్ఎంలకు, ఎంఎల్‌పిహెచ్‌సిలకు ఆదేశించారు. ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం గురించి అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల ఆరోగ్య కార్యక్రమాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో ఏ రోజు పనిని ఆ రోజే అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. డ్రైడే-ఫ్రైడే కార్యక్రమంలలో పాల్గొని సిబ్బందికి సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎపి డీమోలజిస్ట్ డాక్టర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా తైక్వాండో పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, విద్య, ఉపాధి రంగాల్లో ప్రాధాన్యత దక్కుతుందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఈనెల 15, 16వ తేదీల్లో జిల్లా కేంద్రంలోని రాజీవ్ క్రీడా మైదానం వేదికగా జరుగుతున్న రాష్ట్ర 6వ ఇంటర్ డిస్ట్రిక్ట్ క్యాడెట్ త్వైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీలను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల నుంచి హాజరైన క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగించారు. బాల్య దశ నుంచి చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రావీణ్యం అవసరమన్నారు. క్రీడల వల్ల శారీరక దఢత్వంతో పాటు, మానసిక ఉత్తేజం కలుగుతుందని చెప్పారు. క్రీడాకారులకు నిరంతర సాధనతో పాటు సంకల్పబలం ఉండాలన్నారు. విజయనగరం నుంచి ఎంతోమంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు సాధించారని.. వారిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, సెట్విజ్ సిఇఒ రాం గోపాల్, ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, డిసిసి నాయకులు సతీష్ కుమార్, క్రీడా సంఘాల ప్రతినిధులు కాళ్ల సూరిబాబు, చంద్రమోహన్ ప్రసాద్ కలాం, కోచ్ లు, వివిధ జిల్లాల నుంచి హాజరైన క్రీడాకారులు పాల్గొన్నారు.


పోటీలను తిలకిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల